# లోక్‌సత్తా పార్టీ

పత్రికాప్రకటన

తేది: 19-02-2007

అమర్త్యసేన్ స్ఫూర్తి మానవాభివృద్ధి-రాష్ట్ర బడ్జెట్‌కి అవినీతి స్ఫూర్తి

## అమర్త్యసేన్ స్ఫూర్తి కాదు-అవినీతికి దోహదం చేసే బడ్జెట్

విద్య ఆరోగ్యాలకు, స్థానిక ప్రభుత్వాలకు పెద్దపీట వెయ్యకుండా అమర్త్యసేన్‌స్ఫూర్తిని వర్ణించడం అంకెలగారడిని మించిన మాటల గారడీ తప్ప వేరుకాదని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది.

మంచి ప్రమాణాల విద్యను అందించడం ఎండమావి అని ఈ బడ్జెట్ స్పష్టం చేస్తున్నది. పాఠశాల విద్యను సంస్కరించడానికి బదులు, వసతుల కొరత, ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి బదులు విద్యను ప్రయివేటీకరించడానికి 21వ శతాబ్దం గురుకులాల పేరుతో కాన్సెప్ట్ స్కూళ్ళకు నిధులు కేటాయించడం విద్యపట్ల ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుంది.

ప్రజలకు ఉచితంగా మంచి ప్రమాణాలు గల ఆరోగ్య, వైద్యసేవలని అందించడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని బడ్జెట్ విదిలింపులు విశదం చేస్తున్నాయి. 70 వేల కోట్ల బడ్జెట్‌లో విద్యకీ, ఆరోగ్యానికీ వేసిన చిన్నపీట దీనికి అద్దం పడుతున్నది.

స్థానిక ప్రభుత్వాలు స్వతంత్రంగా వ్యవహరించడానికి, స్థానిక ప్రజల అవసరాలు తీర్చడానికి ప్రణాళికానిధులలో ప్రత్యేక కేటాయింపులు చెయ్యకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసే ఏజన్సీలుగానే స్థానిక ప్రభుత్వాలను పరిగణించడం గర్హనీయం. ప్రాంతీయ అసమానతల మీద ప్రజలలో తీవ్ర అసంతృప్తి వున్న నేపథ్యంలో జిల్లాలకు ప్రత్యేక బడ్జెట్‌లు కేటాయించకపోగా, జిల్లా ప్రణాళిక మండళ్లకు  నిధులు కేటాయిస్తామని చేసిన వాగ్దానాన్ని  కూడా ఈ బడ్జెట్‌ను నిలబెట్టుకోలేదు.

వందల కోట్లు ఖర్చు చెయ్యలేకపోతున్న రంగాలకి కేటాయింపులు భారీగా పెంచడం, ప్రజల మౌలిక అవసరాలకు మొండిచెయ్యి చూపించడం జరిగింది. ఇది అవినీతికి దోహదం చేసి బడ్జెట్ కాని అమర్త్యసేన్ ప్రతిపాదించిన మానవాభివృద్ధికి దోహదం చేసేదిగా లేదని లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేస్తున్నది.


**(డి.వి.వి.యస్ వర్మ)**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి

**(భండారి అంకయ్య)**
రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు

**(బండారు రామ్మోహన్‌రావు)**
రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు